మేము ముగ్గురం

మేముండేది ఒక మేడమీదగదిలో - ఆ మేడమీదకి ఎక్కకముందుదాకా మేము ఒక రకమైన మనుష్యులు - మేడ ఎక్కాక మరోకరకం మనుషులం.

మేడ ఎక్కకముందుదాకా ముగ్గురం చేతులూ భుజాలూ కలుపుకుని రోడ్డంతా తిరిగి - కాలేజీకి కలిసివెళ్ళి, కలిసివచ్చి, మేడమెట్లు ఎక్కేదాకా అన్నీ ఒక్క మనిషి చేసినట్టు చేస్తాం. ఆ మేడమెట్లు కొన్ని ఎక్కేశాక, మాలో విచిత్రమైన మార్పు వచ్చేస్తుంది. ముగ్గురం మూడురకాలై పోతాము. మూడురకాల ధృవాలు. ప్రకృతికి తెలిసిన ఉత్తరదక్షిణ ధృవాలలాగా - చస్తే ఒకదానితో మరొకదానికి పొత్తు అక్కరలేని ధృవాలు. నేను యీ విషయాన్ని అనేకరోజుల పరిశోధనలవల్ల ధృవపరిచేను.

ఇంతకూ మేడమీదికెక్కాక: మా శాస్త్రిపని తెలుగు వ్యాకరణంతో కుస్తీ పట్టడం; పద్యాలు చదవడం.

"శ్రీరస్తు భవదంఘ్రి
చికురంబులకు మహో
ఘూర్యద్బములు -
సితాంభోజనయన......"

పద్యమంతా చదివేస్తాడు. ఆ తరవాత వొస్తుంది అనుమానం. 'మహోఘూర్యద్బములు' ఏసమాసం? కర్మధారయమా? కాక, బహువ్రీహేమో. 'వాని కర్మ - కర్మధారయమో కాదో నీకెందుకురా' అంటాను నేను. నాకు పద్యమయితే అద్భుతంగా ఉంది. దానిలో సౌందర్యమంతా వదిలేసి ఏదో మాట ఏసమాసమో తన్నుకునేవాడి నేమనాలి?

ఇంక మాగిరిపని: నిశ్చింతగా యీ ప్రపంచంతో ఏమీ సంబంధంలేనివాడి మల్లే కూర్చుని సిగరెట్లు తగలెయ్యడం. వాడికీ పడకకుర్చీకి ఏదో సాన్నిహిత్యం ఉంది. వాడికి సిగరెట్టు ఖర్చేకాని అగ్గిపెట్టె ఖర్చులేదు; ఒక సిగరెట్టు అయిపోక ముందే యింకోటి వెలిగిస్తాడు. ఏదేనా చదవాలనే తాపత్రయం కాని, పోనీ, వినాలనే ఉద్దేశ్యంకాని వాడికి ఏకోశానా లేదు. 'నీకోసం, నీ పరీక్షకోసం, మీ యింట్లో వాళ్ళు ఎంతో ఆశిసున్నారురా - నువ్వేదో పొడిచేస్తున్నావని అనుకుంటున్నారు, నువ్వు చదవాలిరా,' అంటాడు శాస్త్రి. యత్కించిత్ జ్ఞానములేదు - ఆ మూర్ఖుడికి. వాణ్ణి శపిస్తాడు శాస్త్రి - 'నువ్వు చచ్చినా పరీక్షపాసవవని. అది తనకు వరమనుకుంటాడు గిరి.

ఇక నా వ్యవహారం: యీ రెండింటికీ భిన్నం. మేడముందు బాల్కనీలో తిరుగుతూ ఎదురుగుండా మేడలో ఉన్న అమ్మాయిని చూడడం నాపని. మేడ ఎక్కిన దగ్గరనుంచి దిగేదాకా యిదే పని. ఆ అమ్మాయి మా క్లాసే. ఎప్పుడూ చదువుతూనే ఉంటుంది: బుర్ర కొంచం గట్టిదేమో - ఒకపట్టాన లోపలికిపోదు చదువు.

ఏదో పద్యం చదువుతూంటే ఆ అమ్మాయికీ అనుమానం వొస్తుంది. మహాసాగరము ఏ సమాసం? వాళ్ళన్నయ్య నడుగుతుంది. చప్పున నాకూ సమాసాలమీద యిష్టం కలుగుతుంది. "శాస్త్రీ, మహాసాగరము ఏం సమాసంరా?" అని కొంచం గట్టిగా అడుగుతాను నేను. వాడికి అదురు పుడుతుంది. "ఏమిటోయ్ నీకు తెలుగుమీద యీ అకారణ మమకారం" అంటాడు వాడు - అసలు మమకారం ఎక్కడో వాడికి తెలియదు.

"మా శాస్త్రి "శ్రీరస్తు భవదంఘ్రి చికురంబులకు..." అంటూ పద్యం పాడతాడు. మా గిరి రింగులు రింగులుగా సిగరెట్టుపొగ వొదులుతాడు. నేను ఆ పద్యాల్లో అర్థం ఆ అమ్మాయి పరంగానూ, ఆ పొగవొంపులన్నీ ఆ అమ్మాయి ముంగురుల నొక్కులతోనూ పోల్చుకుని ఊహించుకుంటూ బాల్కనీలో పచార్లు చేస్తాను.

ప్రపంచం ఏమన్నా కానీండి. యింకో కొన్ని వేల ఆంధ్రరాష్ట్రాలు రానీండి. మా కార్యక్రమం యిదే. వాడి వ్యాకరణం, పద్యాలూ, గిరిగాడిసిగరెట్లూ, నా ఊహలూ, పచార్లూ, సూర్యచంద్రాదులు గతులు తప్పినా, మా కార్యక్రమం తప్పదు. మళ్ళా మేడకిందికి దిగామో - మాపనులన్నీ ఒక్కటే - ముగ్గురమూ ఒక్క మనిషిలా ప్రవర్తిస్తాము. విచిత్రమే.

మాలో ఎవడిదగ్గిర డబ్బులున్నా చాలు. ఎవడిదగ్గిరా లేకపోవడం ఎప్పుడూ జరగలేదు. ఎంత డబ్బు నాన్న పంపుతున్నాడో అంచనా తెలియకుండా చేసింది ఎదురుగుండా ఉన్న అమ్మాయి. అదొక ప్రవాహం: నాన్నదగ్గర్నించి నాదాకా. నేనేదో మహా చదివేస్తున్నాననో, రెండో సంవత్సరం కూడా అనో, మా నాన్న అడిగినంత డబ్బూ పంపేస్తున్నాడు, అప్పుడప్పుడు కేకలేసినా. అదీ, మావాళ్ళ డబ్బూ కలిసి మాకు హాయిగా సరిపోతోంది.

మాకు శాస్త్రానికైతే వేరే పక్కలూ, బెడ్డింగులూ, పెట్టెలూ ఉన్నాయి గాని, ఆచరణలో అవేవీ లేవు. రాత్రి చాలా సేపు పొద్దుపోయేదాకా వ్యాకరణంలో స్నేహితుడైన యింకొక వ్యక్తితో 'గజం పడియె' అనే రూపం ఎలా వచ్చిందో సాధిస్తూ కూర్చుంటాడు శాస్త్రి. ఇంకా చాలసేపటిదాకా గిరి సిగరెట్ల పొగను మేఘాల్లోకి పంపిస్తాడు. 'ధూమజ్యోతి స్సలిలమరుతాం సన్నిపాతఃక్వ మేఘః' అన్నారు పెద్దలు. ఇంకా కొంత సేపటిదాకా - అంటే ఆ అమ్మాయి చదువుముగిసేదాకా నేను డాబామీద పచార్లు చేస్తాను. ఎవరికి ఎప్పుడు ఎక్కడ నిద్రొస్తే, అప్పుడు అక్కడ పడుకుంటాము. అదంతా ఒక విచిత్రమైన గది; విచిత్రమైన మనుషులూ; ఎవరికీ ఏపక్కలూ అక్కరలేదు; ఏవి చేతికందితే అవి వేసుకుని పడుకుంటారు; తెల్లారేక తీసి వాటిని చుట్టిపెట్టేవాడెవడూ ఉండడు. మళ్ళీ రాత్రవుతుందిగా! అప్పుడెల్లాగూ పడుకోవాలి. ఈలోపుగా ఎవడు మడతాడు పక్కల్ని...మాకు చాలా పనులున్నాయి!

* * *

ఇలా ఎన్నాళ్ళు గడిచిందో మాకు గుర్తులేదు. కాని కొంతకాలం గడిచిన మాట మాత్రం నిజం. ఇంతలోకి ఎక్కడినుంచి ఊడిపడ్డాడో మామయ్య వచ్చాడు. వచ్చినవాడు నాతోపాటు హోటలుతిండి తిన్నాడుగా...మాటాడక పడుకోరాదూ...ఏదో కోర్టుపనికోసం పగలల్లా బయటికిపోయి చీకటిపడ్డాక మేడమీదికి చేరుకునేవాడు. మామయ్య నాకు మామయ్యకాని, మిగతా వాళ్ళకి మామయ్యకాదుగా! శాస్త్రిపద్యాలు మానలేదు. గిరిగాడు ససేమిరా సిగరెట్లు మానలేదు. ఇంక నాపని బయటికి కనపడే వినపడే పనికాదుగా. ఏమీ ఎరగనట్టుగా బాల్కనీలో పచార్లు చేస్తూనే ఉన్నా - చేతిలో పుస్తకం మాత్రం పట్టుకుని.

మామయ్య వచ్చిన మొదటిరోజునే ప్రారంభించాడు. "ఒరే! మీ నాన్న నీకు నెలకి రెండువందల రూపాయిలు పంపిస్తున్నాడు తెలుసా? నువ్వు యింట్లో ఉంటే వ్యవసాయం పనిచూసేవాడివి.



“మామయ్య ప్రారంభించాడు నీకు వేరేపక్కా, బెడ్డింగూ, బట్టలూ ఉండగా వాళ్ళవీ వీళ్ళవీ వాడత వెందుకురా? వాళ్ళెంత స్నేహితులైతేమాత్రం కాస్త యింగితజ్ఞాన ముండక్కర్లా...”

నువ్వు చదువు వెలిగించబట్టి అక్కడ పాతే రూకి జీతం ఖర్చు అందుచేత నీకు, నీ చదువుకి నెలకి రెండువందల ఏభై రూపాయిలు ఖర్చు. ఆ డబ్బుమీద లాభం లేకపోయినా, అసలు కిట్టుబాటు కావాలా? చదవరా—”

మామయ్య ఎల్లాగో అనుకున్నాడు శాస్త్రి, గిరీ నా డబ్బు తినేస్తున్నారని. యింక సతాయించడం ప్రారంభించాడు. వాళ్ళతో సెకబుర్లు చెపుతూ.

“చూడండి గిరిగారూ. స్నేహితులంటా లే అనుకోండి, మీలాంటి మంచి వాళ్ళు. కాని అష్టమైనవాళ్ళూ మావాడికి స్నేహితులే. వారికోసం డబ్బు తగలెయ్యడమే చివరికి ఒకడూ అక్కరకురాడు. వీడికేం, వీడు సంపాదిస్తున్నాడు కనకనా. ఏ జేబో బాగుపడి వృద్ధిలోకి వస్తాడని వాడు యిపవుతున్నాడు. అసలేమన్నా చదువుతున్నాడంటారా?”

సిగరెట్టుపొగ ఆకాశంలోకి వొదిలి .. యీ పొగలాగా జీవితాలు కూడా నిత్య చంచలాలనీ, క్షణభంగురాలనీ ఏకో వేదాంతిలా చూస్తాడు గిరి. వాడికి సమాధానం చెప్పడానికికూడా నోరుండదు, మేంపిమీదికొస్తే

శాస్త్రి కొంచం నయం మామయ్యకి నచ్చే పద్ధతిలో మాట్లాడతాడు. మా గిరి వ్యవహారం చూస్తే మా మామయ్యకి ఏమీ నచ్చలేదు ఈ గిరిగాడంటే ఆయనకి మరీ అరికాలిమంట నెత్తికొస్తోంది. వాడు తగలేసే ప్రతి సిగరెట్టులోనూ నా రూపాయినోట్లు (అంటే మావాన్నవి) ఆయనక్కనిపించాయి' పైగా యీ గిరి అసలు మాట్లాడడు. ఈ ప్రపంచంలో ఎవరినీ లెక్కచెయ్యడు. నా వస్తువులు, అని మామయ్యకి తెలిసిన రేజరు, బట్టలు, మొదలైనవన్నీ అలవాటు చొప్పున తనవిలాగా వాడుకుంటున్నాడు. మళ్ళా తీసినవాటిని జాగ్రత్తగానైనా పెట్టడు. మామయ్యంటే ఉండే గౌరవంకొద్దీ నేను కొంచం మారేనుగాని, వాడేమీ మారలేదు. పైగా యింకా నిర్లక్ష్యంగా తయారయ్యాడు.

మామయ్యకి పచ్చివెలక్కాయ గొంతులో పడ్డట్టయింది. ‘నాది’, ‘నేను’ అనుకునే మన స్వత్వంతో, ప్రతీదీ రూపాయి, అణా, పైసల్లో కొలిచే మామయ్యకి మా సంబంధాలు ఏమీ అర్థంకాలేదు. ఒకరోజున ట్రంకుపెట్టె తాళం లేకపోవడం చూశాడు. అందులో డబ్బుంది. దాంట్లోంచి నాకు-

కావలసిన డబ్బు తీసుకుంటూండగా చూశాడు. తరవాత గిరిగాడుకూడా అందులోంచే డబ్బు తీసుకోవడం చూశాడు. ఇలా అందరి డబ్బూ ఒకదగ్గరే ఉండి, లెక్కా, పత్రం లేకుండా ఎవరికి కావలసింది వాళ్లు తీసుకోవడం, మామయ్య సహించలేకపోయాడు.

వెంటనే ఆయన ఒక నిర్ణయానికి వచ్చేశాడు. వీళ్ళంతా నా డబ్బే తింటున్నారు; అని. కాని నిజానికి అదేమీ కాదు, నేనా విషయం ఆయనతో చెప్పకూడా. నే నెప్పుడూ సరిగా లెక్క చెయ్యకపోయినా, ఆ వేళ వేశాను. నాకు నాన్న సుమారు 125 రూపాయలు పంపుతాడు. గిరిగాడి యింటి నించి దరిదాపు 150 దాకా వస్తూంటాయి. యింక ఎటొచ్చీ స్థిరమైన ఆదాయం లేనివాడు శాస్త్రి ఒక్కడే. కాని, మా యిద్దరిదీ, వాడిదీ కలిసి మొత్తం మాకు సరిపోతుందిగా!

మామయ్య వొచ్చాక, యింతవరకూ ఉన్న యీ పరిస్థితి మారిపోతుందేమోనని భయం వేసింది నాకు. ఎందుకంటే, మేము లేకపోతే, శాస్త్రిగాడికేం పరవాలేదు. హాయిగా చదువుకుంటాడు. లేదా హాయిగా యింటికి చక్కాపోతాడు. కాని మాకే. వాడు లేకపోతే నేను బతకలేను. గిరిగాడు అంతకన్న ఉండలేడు. మా ముగ్గురికీ ఉన్న సంబంధమేమిటో నాకు అర్థంకాదు. అప్పటి మాటే కాదు - ఇన్నేళ్లయిందా, మూగిరకాల ధృవాల లాంటి మేం ముగ్గురం ఒకళ్ళు లేకపోతే యింకోళ్లు ఉండలేం.

శాస్త్రిగాడు చాలా సున్నితమయిన మనిషి. మామయ్య అన్న మాటలన్నీ శాస్త్రికే తగిలేవి. గిరిగాడు కేవలం గిరి; మహాపర్వతం. గంభీరంగా అలా కూర్చుని సిగరెట్లు కాలుస్తూనే ఉన్నాడు. గోదావరి వచ్చిన నాటిరాత్రి రాజమండ్రి తుమ్మలావలో ఉన్నా అల్లాగే సిగరెట్లు కాలుస్తూండేవాడని నా నమ్మకం.

మామయ్య ప్రారంభించాడు. "నీకు వేళపక్కా, బెడ్డింగూ, బట్టలూ ఉండగా, వాళ్ళవీ, వీళ్ళవి వాడతావెందుకురా. వాళ్ళంత స్నేహితులైతే మాత్రం - కొస్త యింగితజ్ఞానముండక్కర్లా...

"అవునురా - ఒరే - నీ పెట్టికి తాళం అదీ ఉండక్కర్లా. నీ వస్తువులూ, అవీ జాగ్రత్తగా, భద్రంగా, పెట్టిలో పెట్టి, తాళం వేసుకోవాలిగాని, నీ యిష్టం వచ్చినట్టు పారెయ్యడమేనా? నీ స్నేహితులు మంచివాళ్లే ననుకో... కాని, యీ రూములోకి ఎంతోమంది వస్తారు, వెళ్తారు.

"ఏమండోయ్ - గిరిగారూ - శాస్త్రిగారూ - మీ రయినా సరే. జాగ్రత్త మంచిదికదండీ, మీరు పెట్టెలకి జాగ్రత్తగా తాళాలు వేసుకుని, తాళంచెవులు మీదగ్గర పెట్టుకోండి. అదిభద్రం గాని,...యిదేమిటీ ఏవస్తువు పోయినా!"

నాకు యీమాట కొంచెం మురుకుగా తగిలింది. ఇన్నాళ్ళబట్టి ఇక్కడున్నాము గాని...నాది, నా పెట్టె, అనే ఆలోచనకి తావే లేకపోగా, పెట్టెలకి తాళం వేసుకోవాలనే ఊహ కూడా రాలేదు. మా గిరిని గాని, శాస్త్రిని గాని అనుమానించడమంటే నన్ను నేను అనుమానించుకోడంలాంటిది. మామయ్యకేం తెలుసు. ఇంట్లో అత్తయ్యకూడా అనుమానపడి పెట్టెలు తాళం వేసుకునే మనిషి. నాకు అరికాలులో మంట పుట్టింది. ఈయనలా ప్రపంచమంతా అపనమ్మకాల పుట్ట అని యీయన ఉద్దేశం. ఈయన బతికుండగా యింకోళ్ళని నమ్మడు ...అయినా మామయ్య చెప్పిన మాటలలో కొంత అనుభవం, నిజం ఉన్నాయేమో! ఇంకా చాలామంది వస్తూంటారన్నాడు. నిజమే. అనేక రకాలవాళ్లు వస్తూండవచ్చు. మామయ్య చెప్పిన మాట నిజమేనేమో.

గిరి, మామయ్య మాటలకి చలించలేదు. "నా పెట్టికి తాళం లే"దన్నాడు, ముభావంగా.

శాస్త్రి కొంచం సూరేకారపు జాతి. "మీ పెట్టెకి భద్రంగా తాళం వేసుకుంటున్నారుగా! చాలులెండి" అన్నాడు.

మామయ్య మొహం కందగడ్డయింది. "మీ శ్రేయస్సుకోసం చెపుతున్నాను - యిందులో నాకు ఒరిగిందేమీ లే"దన్నాడు. నాకు శాస్త్రి మాటలు బాధ కలిగించాయి. మామయ్య మన మంచికోసమే చెప్పాడు గాని, తనకేం నష్టం, మేం అనుసరించకపోతే.

"కుర్రకుంకా, నీ కింకా తెలియదు. నల్లనివన్నీ నీళ్ళనీ, తెల్లనివన్నీ పాలనీ నీ నమ్మకం"— అన్నాడు మామయ్య నాతో ఏకాంతంగా.

నేనేమీ మారలేదు. మిగతావాళ్లూ మారలేదు. మామయ్యా మారలేదు.

మామయ్య యీసారి నాకొక్కడికే వేరే కొన్ని సంగతులు చెప్పడం ప్రారంభించాడు. అందరం ఉన్నప్పుడు సరదాగా మాతో కాలక్షేపం చేస్తున్నాడు. కనపడ్డ ప్రతి వస్తువూతీసి దాని ఖరీదు అడగడంమామూలు ఆయనకి. గిరినెలాగూ అడగడు. అడిగినా వాడు చెప్పడు. శాస్త్రి నడిగితే, చెప్పినప్పుడు చెప్తాడు, లేనప్పుడు లేదు. ఇంక నన్నడుగుతాడు. ఏదో ధర చెప్తాను. అంత కన్నా తక్కువకి దొరుకుతున్నాయంటాడు. ఇది ఆయనకి మామూలు. ఒకసారి ఫోటోఫ్రేమ్ చూశాడు. రేజరు సెట్టు చూశాడు. పెన్ను చూశాడు. వీటి ధరలడిగాడు. ఫోటోఫ్రేమ్ బాగుందని అంగీకరించాడు. దానిధర రూపాయన్నర అయితే కొనవచ్చన్నాడు. నేను అయిదు రూపాయిలకి కొన్నానన్నాను. మిగతావి యింతే.

మాటల్లో జ్ఞాపకంవచ్చి, "ఒరే, నీకు మీ నాన్న వాచీ కొన్నాడట, ఏదిరా" అన్నాడు.

రిపేరరు దగ్గిరుంది, తేవాలన్నాను.

"అది చాలా ఖరీదయిన వాచీరా, ఎవడో రిపేరరు కిచ్చావంటావేమిటి? దగ్గిరుండి బాగుచేయించుకు రాక? యీ వాచీ రిపేరర్లని నమ్మకూడదురా, ఖరీదయిన సామాన్లు తీసేసి ఏవో చెత్తవి వేస్తారు.."అని చాలాకోపంగా అన్నాడు.

నాకు నవ్వువచ్చింది. ఆశ్చర్యమూ కలిగింది. అసలు కొన్నిరకాల మోసాలు మనం ఊహించలేం. నా వాచీ యిచ్చేటప్పుడు నాకు యింలాంటి అనుమానమే స్ఫురించలేదు.

"వాడిదగ్గిర కూచుంటే మాత్రం తియ్యదల్చుకుంటే సామాన్లు తియ్యలేడా-నమ్మకం ఉండాలి గాని. వాచీ రిపేరర్ నా స్నేహితుడే పరవాలేదులే" అన్నాను...సావకాశంగా.

ఏమయినాసరే - ఆ సాయంత్రం వాచీ తెచ్చేదాకా నిద్రపోలేదు మామయ్య. సరే తెచ్చాను. దాన్ని సరదాకి తనచేతికి

కేశముల సౌందర్యాభివృద్ధికి
కాశ్మీర్-కుసుం
ఇష్టమైన నూనెలో నానబెట్టుడు
సుగంధ చర్మరక్షణ మలామ్
సాంటలక్స్
దురద, గజ్జలు, కాట్లు, మొటిమలకు
ప్రేమలీలా
ప్రసిద్ధమైన మైసూర్ ఊదువత్తులు
నంజన్‌గూడు-పండ్లపొడి
ఫ్యాక్టరీ వారి
నమ్మకమైన 60 ఆయుర్వేద ఔషధములు.
ఏజంట్లు: యునైటెడ్ కళానరణ్య,
54, బంగారువీధి; మద్రాసు-1
బ్రాంచి: బకింగ్‌హాంపేట, విజయవాడ-2.

పెట్టుకోడానికి ప్రయత్నం చేశాడు. ఆ సైకిల్ పెట్టడం కుదిరిందికాదు. లాగాడు - తోశాడు - బిగించాడు - వగులు చేశాడు - చివరికి సైకిల్ కాస్తా విరిగి ఊరుకుంది. "వధవసైకిల్ ఎంతకి కొన్నావురా" అన్నాడు. "నాలుగురూపాయి" లన్నాను. "దండుగ-యిట్టే విరిగిపోయింది"అన్నాడు.

"విరక్కొడితే, ఎంత ఖరీదయినదయినా విరిగిపోతుంది," అనేసి నాలుక్కొరుక్కున్నాను.

"ఇంకో సైకిల్ కొనరా, ఎందుకు నాలుగు రూపాయిలు దండగ, కొంచం చవకది కొను."

నేనొక్కడినీ బజారుకు ఎప్పుడూ పోను. గిరిని రమ్మంటే రానన్నాడు. శాస్త్రిగాడికీ వాడి స్నేహితుడికీ 'అపార పారావారము' ఏ సమాసమో తేలలేదు. మేడమీద ఆ అమ్మాయి ఉండగా నేను కిందకి దిగదల్చుకోలేదు. దాంతో ఆ వాచీ మళ్లా పెట్లో పడేశాను.

ఆ వేళ మామయ్యకి కోర్టులో వాయిదా. కిందటిసారి వాయిదా కొంచం దగ్గర పడేసరికి మళ్ళీ వెళ్ళవచ్చేదేమిటిలే అని ఉండిపోయాడుట. పొద్దున్న వెళ్ళిన వాడు మధ్యాహ్నం మూడుగంటలకి తిరిగొచ్చాడు అప్పటికి మేమూ కాలేజీనుంచి వచ్చాము. కాఫీ తాగాక, మామయ్య నన్ను పిల్చి, "ఒరే! నాకో పాతిక రూపాయలు అర్జంటుగా కావాలిరా. ప్లీడరు అర్జంటుగా కావాలన్నాడు. మళ్ళా యింటికెళ్ళిన వెంటనే పంపించేస్తాను" అన్నాడు.

గబగబా వెళ్ళి పెట్టె తెరిచి చూశాను. అందులో మహా ఉంటే పది రూపాయిల లోపు ఉంటాయేమో.

"మామయ్యా, రూములో డబ్బంతా అయిపోయింది. మహా ఉంటే పది రూపాయిలుంటుందేమో. ఇంకా ఎవరకీ మని యార్డరు రాలేదు" అన్నాను.

మామయ్య తల పంకించి, "నీ దగ్గర డబ్బంతా అప్పుడే అయిపోయిందట్రా! నాన్న యీ నెల 150 పంపేడన్నావ్. మరీ యింత ఖర్చేమిట్రా" అన్నాడు.

నాకు మండుకొచ్చింది. యిందులో దాదాపు 50 రూపాయిలు నీకోసమే అయిపోయింది. పాపం గిరిగాడు, శాస్త్రి యీ నెల ఖర్చు ఆట్టే చెయ్యకపోబట్టి సరిపోయిందనుకుంటాను - అని అనేద్దామనుకున్నాను గాని, ఊరుకున్నాను.

"ఆ గిరిగాడిదగ్గర లేదూ..." అన్నాడు మళ్ళీ.

"లేదు మామయ్యా, ఉంటే అంతా పెట్లోనే ఉంటుందిగా."

"పోరా! నీదంతా మరీ యిది. వాడు చేస్తున్న పనులన్నీ నమ్ముతున్నావా చెప్పు. ప్రపంచమంతా నీలాగా మంచివాళ్ళనుకున్నావా? వాళ్ళ నాన్న పంపిందంతా గిరిగాడూ శాస్త్రీ, నీలాగా నిజాయితీగా పెట్లో వేస్తున్నారంటావా? నువ్వు వట్టి వెర్రిదద్దమ్మవి కాబట్టి, వాళ్ళ పొట్టూ, నీ పప్పూ కలిపి ఊదుకు తింటున్నారు."

అమర్నాడే గిరికి 150 రూపాయిలు మనియార్డరు వచ్చింది. మేమందరం చూస్తూండగానే పెట్లో పడేశాడు వాడు. గిరిగాడి నాన్న వాడికన్నా గంభీరుడు. డబ్బు పంపించేనన్న మాటే కాని - మరొక అక్షరమయినా ఉత్తరంలో లేదు.

ఆ వేళ మామయ్య సాయంత్రం ఎక్కడికో వెళ్ళాడు. రాత్రి కొంచంఆలస్యంగా వచ్చాడు. అప్పటికి మేమూ భోజనానికి వెళ్ళలేదు. అప్పుడు బయలుదేరి తిండి తిని పడుకున్నాము. ఆ వేళ బాగా చలేస్తోంది. శుభ్రంగా ముసుగులుతన్ని పడుకున్నాము.

పడుకోబోతూ, మామయ్య తెల్లవారుఝామున ఏదో ఊరు వెళ్ళాలన్నాడు. "అలారమ్ పెట్టాలా?" అంటే ఒద్దన్నాడు.

ఆయన నాలుగు గంటలకే లేచాడు. పెట్టే, బెడ్డింగూ సర్దుకున్నాడు. రైలు టైమవుతూండగా "నేను వెళ్తున్నారా" అని నన్ను లేపాడు.

చలికాలపు తెల్లవారుఝాము నిద్ర— మామయ్య పిలుపుకి నాకన్నా ముందు శాస్త్రి లేచాడు. శాలువా ముసుగు పెట్టి "దళీవేళన్ చెలి లేని జీవనము వృధా, చంచద్వయశ్శాలికిన్—" అంటూ పద్యం లంకించుకున్నాడు. మామయ్యతో- "సరే, మంచిది వెళ్ళండి," అన్నానేగాని బాగుండదని లేచాను. గిరి ఏమయినా సరే లేవడు.

నేనూ శాస్త్రీ, మామయ్యా కిందకి దిగాము. ఆ చలిలో, రాత్రి ఏ కూలాడు దొరుకుతాడు? ఇంతట్లో రైలు కూసింది. నేను సావకాశంగా - "మామయ్యా, నీకీ రైలు అందదు, తెల్లవారేక వెడుదువు గానిలే" అన్నాను.

"అన్నట్టు మరిచిపోయాను - యీ వేళ నీ పుట్టిన రోజురా - మీ నాన్న రాశాడు కూడాను" అన్నాడు శాస్త్రి.

"అవును, మరిచిపోయాను మామయ్యా, ఉండిపో, రేపెళ్ళచ్చు." అన్నాను నేను.

"కాదురా. నేను వెళ్ళకపోతే కొంప మునుగుతుంది. ఎల్లుండి కోర్టులో సాక్ష్యానికి ఒక మనిషిని పంపాలి. ఆ మనిషి నేను వెళ్ళబోయే ఊళ్ళో ఉన్నాడు. మళ్ళా వెంటనే నేను మా ఊరుకూడా వెళ్ళాలి. చాలా అర్జంటు. పోనీలే, యీ రైలు పోతే పోయిరి, బస్సుకు పోతాను, ఓ పావలా ఎక్కువయితే అయింది."

మామయ్య తొందరపడుతున్నాడు. కూలివాడెవడూ దొరకడు. ఆ పెట్టె మేం ముగ్గురం కలిసికూడా మొయ్యలేం. ఇంతట్లో కారు హారన్ వినపడింది.

"టైమయిపోతోంది పరిగెట్టితే బస్సందుతుంది" అన్నాడు శాస్త్రి:

"సరే - యింకేం చేస్తావ్ మామయ్యా, ఆ వూళ్లో పనిచూసుకుని మళ్ళా మధ్యాహ్నం బస్సులో యిక్కడికి కొచ్చెయ్. వెంటనే బయలుదేరి యింటికెళ్దువుగాని. లేకపోతే యీ సామాను యిప్పుడెలా మొయ్యగలం?"

"పెట్టె వొదిలేస్తే ఎల్లారా?..." మామయ్య కేమీ తోచటంలేదు. మేమెవ్వరమూ మాట్లాడలేదు. బస్సు హారన్ మళ్ళా వినిపించింది. చివరికి తెగించి, "పెట్టె జాగర్తరోయ్" అరిచి పరుగు లంకించుకున్నాడు మామయ్య.

"భద్రంగా తాళంవేసి. తాళంచెవి మీ దగ్గరుంచుకున్నారుగా" అని అరిచాడు శాస్త్రి. నాకు నవ్వాగిందికాదు.

మామయ్య వెళ్ళాడన్న మాటేకాని, ఆయన మనస్సు యీ పెట్టె, బెడ్డింగుమీదే ఉండి ఉంటుంది. శరీరం మాత్రమే బస్సెక్కి ఉంటుంది.

మేడెక్కి మళ్లీ పడుకోవాలనుకున్నాం గాని, ఆ వేళ నాపుట్టినరోజు. మొహం కడుక్కొని స్నానం చెయ్యమన్నాడు శాస్త్రి. సరే, యింత చలిలో అలాగే చేసి, కొత్త బట్టలు తొడుక్కొని, గిరిగాణ్ణి లేపాము. వాడు సావకాశంగా లేచాడు. బయటికి బయలుదేరాము. గిరి నాకోసం ఏవేవో వస్తువులుకొని పుట్టినరోజు పండుగ బహుమానంగా యిచ్చాడు. శాస్త్రి ఒక చక్కని తెలుగు పుస్తకం కొని బహుమానంగా యిచ్చాడు. అంతా కలిసి కాఫీ తాగి రూముకి వచ్చేసరికి సుమారు పదిగంటలయింది. ఇంక మేడమెట్లెక్కబోతూండగా ఆ అమ్మాయి వాళ్ళయింటి గుమ్మం దగ్గర నిలబడి మమ్మల్ని పిలిచింది. ఏమిటో అనుకుని వెళ్లాము. ఆ వేళ నా పుట్టినరోజు కాబట్టి తన శుభాకాంక్షలు అందజేసింది! రిబ్బను ముడివేసిన పార్సెలు ఒకటి అందజేసింది! నాకేదో విపరీతమయిన ఆశ్చర్యం వేసింది. ఒక్కక్షణంలో ఏవేవో స్ఫురించాయి. ఏదో ఉన్మత్త ఆనందంతో, ఉత్కంఠతో, 'థాంక్స్' అనేమాట అనేసరికి చాలా కష్టమయిపోయింది.

గబగబా మేడమెట్లెక్కి పోయాను బాణంలాగా. నా సంతోషానికి అంతులేదు; అవధిలేదు - నా పుట్టినరోజు యీ వేళ అని

ఆ అమ్మాయి కెల్లా తెలుసు? ఇదంతా శాస్త్రిపని. నాన్న రాసిన ఉత్తరం మైక్‌లో చదివినంత గట్టిగా చదువుతాడు. మా ప్రతి కదలికా ఆ అమ్మాయికూడా గమనిస్తున్నదన్నమాట! నే నాక్షణంలో ఒక దివ్య స్వర్గంలో ఉన్నాను. ఆ పార్శెల్ నా చేతిలోంచి లాక్కుని రిబ్బన్ విప్పాడు శాస్త్రి. ఆశ్చర్యం! అందులో చక్కని వాచీచైన్ ఉంది! నా వాచీచైన్ విరిగిపోయిందని యీ అమ్మాయికి తెలిసే యీపని చేసుంటుంది. ఆ వాచీ పెట్టుకోవాలి యీ వేళ!

గబగబా పెట్టె తీశాను. వాచీ కనబడ లేదు! అరె, ఏమయింది? పైనే పెట్టానే! లోపలకూడా వెతికాను. లేదు. పెట్టెలో డబ్బులతో సహా అన్నీ బయట ఒలకబోసి చూశాను. కనపడలేదు. ఏమయింది చెప్మా! ఏ శాస్త్రి గాడో, గిరి గాడో ఏడిపించడానికి తీశారా? శాస్త్రినడిగాను. వాడు అదిరిపడ్డాడు. నాకన్నా ఎక్కువ కంగారుగా వెతకటం ప్రారంభించాడు. వీడు వేళాకోళానికి తీస్తే మొహం యింకోలా ఉంటుంది. సీరియస్‌గా వెతుకుతున్నాడు. వీడికేమీ తెలియదు వాచీసంగతి. గిరి నడిగాను. 'నాకేం తెలుసోయ్ నీ వాచీసంగతి' అన్నాడు నిశ్చలంగా.

వాచీ ఏమయిఉంటుంది? ఏదో జరిగి ఉండాలి. మా రూములో ఎప్పుడూ యిలాటివి జరగలేదు. ఎవరిని అనుమానించడమూ మాకు చేతకాదు.

“ఏమయిఉంటుందిరా? వాచీ” శాస్త్రి నడిగాను. వాడి మొహం అప్పుడే కందగడ్డ అయిపోయింది. వాడిమీద అనుమానపడడం తేలిక అని వాడికి తెలుసు. అందుకనే నేను మాటలు చాలా జాగ్రత్తగా వాడుతున్నాను. వాడిని బాధపెట్టడం నాకు యిష్టంలేదు. గిరి అసలు యీ రంగంలోకే రాలేదు కొంతసేపు. కాని రానురాను వాడికీ భయంవేసింది, నిజంగా పోయిందేమోనని. వాడుకూడా రూమంతా వెతికేశాడు. ఎక్కడా దొరకలేదు.

దేవతలకి ముందు హాలాహలం దొరికి, తరవాత అమృతం దొరికింది. నాకు ముందు అమృతం దొరికి తరవాత అందులో హాలాహలంపడింది.

నిజానికి నాకు వాచీ పెట్టుకోలేకపోయాననే బాధ, వాచీపోయిందనే వ్యథకన్నా, యీ స్వర్గంలో మామధ్య యీ సంఘటన ఎలాటి అవాంఛనీయ పరిస్థితులు తెచ్చి పెడుతుందో అనే భయం ఎక్కువైంది. శాస్త్రి, గిరి, అసలు మాట్లాడ్డమే లేదు. శాస్త్రి మొహం కందగడ్డయిపోయింది. గిరి మాత్రం హిమాలయోత్తుంగ శృంగంలా తల పెట్టి, సిగరెట్లు కాలుస్తూనే ఉన్నాడు.

ఇలాంటి సమయంలో వచ్చేశాడు మామయ్య. ఆయన్ని చూడగానే నా కెందుకో ఆ పాదమస్తకం నరాలు కదిలిపోయాయి ఒక్కసారి. ఆయనకి కావలసినట్టు తయారయింది స్థితి...

రావడం రావడం టేబులుమీద పెట్టి ఉన్న చైన్ చూసి...కొన్నావేమిట్రా అంటాడేమో అని భయపడ్డాను. కాని చూసికూడా ఆ మాట అనలేదు. శాస్త్రిమాత్రం చెప్పేశాడు. 'మీవాడి వాచీ కనిపించటం లేదు'ని. నాకు గుండె కొట్టుకోడం మానేసినట్టయింది. అక్కడ నిలబడలేకపోయాను. ఎక్కడికేనా వెళ్ళిపోవాలి. మామయ్య అనబోయే మాటలు మా ముగ్గుర్నీ శాశ్వతంగా దూరం చేసెయ్యగలంత వాడిగా ఉంటాయి; నాకు తెలుసు. ఈయన్ని తెల్లవారుఝామున సామానుతో సహా పంపేసిఉన్నా బాగుణ్ణు.

మామయ్య కూడా గాభరాగా పెట్టి వెతికాడు. ఎన్నో ప్రశ్నలు వేశాడు. మామయ్య యీ అవకాశాన్ని ఎందుకో అంత మరీ తీవ్రంగా ఉపయోగించుకో లేదు. కాని అప్పటికీ ఆయన అన్న మాటలు సామాన్యమయినవి కావు. “స్నేహితులని నమ్ముకున్న వాళ్లంతా యింతే! పైకిమాత్రం అందరూ పెద్దమనుషులే - సమయం దొరికేదాకా. చెపితే ఒక్కరు విన్నారూ - అనుభవించు. యీ సంగతి మీ నాన్నకి తెలిస్తే...” అదృష్టవశాత్తూ మామయ్యకి బండి టైమ్ అయింది. బండి 12 గంటలకి. గదిలో ఎవరూ భోజనాలకి బయలుదేరేట్టు లేరు. ఏదో మనిషి చచ్చిపోతే, పీనుగపోయిన తరవాత యిల్లులా ఉంది మా రూము. మామయ్య చేతికి ఒక హోటలు టికెట్టు చించియిచ్చి “భోజనం చేసి రండి” అన్నాను నీరసంగా. మామయ్య నన్నూ రమ్మన్నాడు. ఎందుకూ - యీయన గారి ధర్మపన్నాలు వినడానికేగా - “నేను రాను, మీరు వెళ్ళిరండ”న్నాను “ఈ టికెట్టుయిస్తే భోజనం పెడతాడుగా” అన్నాడు. “ఓ” - అన్నాను మామయ్య బయలుదేరాడు ధైర్యంగా.

ఇలా, యింకో కొన్ని గంటలు గడిస్తే ఏదో ప్రళయం వచ్చేస్తుంది. ఏమిటీ శ్మశాన శాంతి? నేను భరించలేకపోయాను మామయ్య మాటలు యింకా చెవుల్లో మోగుతున్నాయి. ఒకరు యింకొకరి మొగంకేసి చూడ్డం కూడా సాధ్యం కావడంలేదు - నాకు వీళ్ళమీద ఏ అనుమానమూ లేదని ఎల్లా చెప్పడం? మామయ్య మాటలు వాళ్లమీద చాలా దారుణంగా పనిచేశాయి. ప్రపంచం పాపిష్ఠిదా? - డబ్బు పాపిష్ఠిదా?

అనుమానం అన్ని రకాలుగానూ పోతోంది...వాచీ, ఏమయిఉంటుంది? యీమధ్య రూములోకి ఎవరెవరు వచ్చారు? మామయ్య అన్నమాటలన్నీ జ్ఞాపకానికి వస్తున్నాయి, వెనక నాలుగురోజుల క్రితం ఆ వాచీ తెచ్చాను. ఆ తరవాత ఎవరూ వచ్చినట్టు లేదే! మేము ముగ్గురం - మామయ్య, అంతే. శాస్త్రి వ్యాకరణం స్నేహితుడైనా రాలేదు. మామయ్య...అవును, మామయ్య ...ఛా! ఏమిటీ అనుమానం? సాక్షాత్తు మామయ్య, చిన్నప్పటినుంచీ తనకి జాగ్రత్త నేర్పుతున్న మామయ్య... డబ్బు ఎంత పాపిష్ఠిది? అందరినిగురించీ అనుమానం కలగజేస్తుంది!

ఏమో! ఆ వేళ అసలు చైన్ విరిగిపోయాక మా పెట్లో పడేశానా? ఆయనకి గాని యిచ్చేనా? ఆయనకే యిచ్చానేమో ఒకవేళ! అదే నిజమయితే అలవాటుచొప్పున తన పెట్లో వేసుకున్నాడేమో, మరచిపోయి. ఆయన జాగ్రత్తమనిషి.

నా తొందర మామయ్య భోజనం చేసి వచ్చేదాకా ఆగనివ్వందికాదు. పెట్టె నేను తీస్తే ఏమనుకుంటాడేం? మా తాళంచెవితో ఆయన పెట్టె తాళం వచ్చేసింది. పెట్టె నాలుగుపక్కలా వెతికాను - లేదు. బట్టలు కొన్ని బయటికితీసి చూశాను - కనపడలేదు. 'నా పెట్టెలోనే పెట్టిఉంటాను -' అనుకుంటూ యథాలాపంగా ఏదో సంచీ తీశాను. అందులో గబుక్కున కంటపడింది, కాగితం చుట్టినవాచీ! నా కేమేమి అనిపించినవో, ఒక్క క్షణకాలంలో ఎన్ని సంగతులు స్ఫురించినవో చెప్పలేను. ఎందుకో గబగబా పెట్టెలో బట్టలు కుక్కేసి తలుపేసి తాళం నొక్కేశాను. “శాస్త్రి - వాచీ దొరికిందిరా” అని ఒక్క గావుకేక పెట్టాను.

వాడేమీ ఆశ్చర్యపడకుండా - “ఎక్కడ దొరికిందిరా” అన్నాడు బాల్కనీలోంచి లోనికివస్తూ. శాస్త్రి ఆశ్చర్యపడకపోవడం చూసి నా కాశ్చర్యం కలిగింది.

“అచ్చె - పెట్లోనే ఉందిరా...మూల. ఇందాకా మనం సరిగ్గా వెతకలేదు.”

“నువ్వూ, నేనూ సరే...అలాగేననుకో.

(52-వ పేజీ చూడండి)

(11-వ పేజీ తరువాయి)

కాని మీ మామయ్యకూడా వెతికాడుగా? ఆయనకూడా అంతేనంటావా?"

యీ అబద్ధం నేను ఎందుకు చెప్పానో నాకు తెలియదు. నాలో ఏరక్తం యీపని చేయించిందో చెప్పలేను. కాని ఎందుకో 'మామయ్య' యీపని చేశాడని చెప్పగల ధైర్యం నాకు లేకపోయింది.

కేసరి రత్నత్రయము

లోధ్ర

గర్భాశయ రోగ నివారిణి

స్త్రీలకు గలుగు ఋతుశూలం, బహిష్ఠ కాకుండుట, అకాల బహిష్ఠ, మైల జాస్తిగాను తక్కువగాను పోవుట, కుసుమ రోగము సంతానహీనత, రక్తహీనత, మలబద్ధము, సూతికావాతము, కీళ్ళ నొప్పులు, అరికాళ్లు, అరచేతులు మంట మొదలగు స్త్రీ మర్మవ్యాధులను కుదుర్చును.

అమృత

రక్తశుద్ధి ద్రావకము

ఇది రక్తహీనత, మలబద్ధము, అజీర్ణము, కీళ్ల నొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, నిస్సత్తువ, కడుపులోమంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతిని ముఖమునకు తేజస్సును యిచ్చును.

అర్క

సర్వజ్వర నివారిణి

ఆహార, విహారములు భేద దోషంబుల వలన ఆమాశయమునందు క్రిమికూటము చేర ఎలవిధములైన జ్వరములు సంభవించుచున్నవి. వాతజ్వరము, పిత్తజ్వరము కఫజ్వరము, సన్నిపాతజ్వరము మరి యితర విషమజ్వరములను, కడుపులోప్లీహమును జ్వరగడ్డను కుదుర్చును.

కేసరి కుటీరం
లిమిటెడ్

రాయపేట : మద్రాసు-14.

తెలుగుజిల్లాలకు, హైజాముకు ఏజంట్లు.

శ్రీ సీతారాం జనరల్ స్టోర్సు

బెజవాడ. సికింద్రాబాదు.

కాని శాస్త్రి జెవాంతకుడు. వాడు చూసినట్టున్నాడు నేను పెట్టె తియ్యడం.

గిరి వెనక వరండాలో మామూలుగా సిగరెట్లు కాల్చుకుంటున్నాడు.

మామయ్య వచ్చాడు. రైలు టైమయిపోయింది గబగబా పెట్టె బెడ్డింగూ కూలివాడి నెత్తినబెట్టి 'నేను వెళ్తున్నానురా' అన్నాడు.

"మేమూ వస్తాం - మీకు తోడుగా స్టేషనుదాకా" అన్నాడు శాస్త్రి.

మేము ముగ్గురం బయలుదేరాం.

"రూములో జాగ్రత్తగా ఉండండి. ఈ వాచీ పోయిందని మీ నాన్నకి తెలిస్తే యింకేమన్నా ఉందా......" అని చెప్పి రైలెక్కాడు మామయ్య. గిరి నాకేసి, మామయ్యకేసి వింతగా చూశాడు. వాడి చూపులు నాకే అర్థమవుతాయి. వీడికూడా యీ సంగతి తెలిసి ఉంటుంది, అనుకున్నాను.

మధ్యాహ్నం నిద్రపోయి లేచేసరికి గిరి పెట్లో డబ్బు లెక్కపెడుతున్నాడు. ఎప్పుడూ లేనిది యిదేమిట్రా అనుకున్నాను.

"ఏరా! పొద్దున్నుంచీ నల్భై రూపాయిలేం ఖర్చు పెట్టామురా" అన్నాడు గిరి.

నాకు ఆశ్చర్యంవేసి..."తప్పు లెక్కపెట్టావేమో చూడవోయ్ బడుద్ధాయ్" అన్నాను.

నేను రెండు రూపాయిలు తీశానంతే.

"ఏమో - యిందులో 40 రూపాయిలు తక్కువొస్తున్నాయి. మొన్న నాన్న 150 పంపించాడు. మనం ఎంత గూచినా 20 కన్నా ఎక్కువ ఖర్చు పెట్టిఉండం. యిందులో 90 మాత్రం ఉన్నాయి...... చిల్లరకేమిటే." అని లెక్క చెప్పాడు గిరి.

శాస్త్రి సాంతకోణంగా నిలబడి—

"నిన్న రాత్రి వాళ్ళ మామయ్యకి కావలిసొస్తే బదులిచ్చాడు లేవోయ్ - మరిచిపోయాడు" అన్నాడు గిరితో.

నాకు అప్పటికిగాని స్ఫురణకి రాలేదు, వాడి మాటల్లో వ్యంగ్యం. నా మొహం ముడుచుకుపోయింది, మామయ్య చేసిన పనికి.

"ప్రపంచంలో మామయ్యలు చేసిన పనులు దాగుతాయి...యీ పనే స్నేహితులు చేస్తే..." అన్నాడు గిరి. వాడు అసలు మాట్లాడడు. ఎప్పుడేనా మాట్లాడేడా గూడులు మాట్లాడుతాడు.

"ఆయనకి యింటికెళ్ళాక గాని తెలియదు. మనకి ఆయన సంగతి తెలుసునన్న సంగతి......మరచిపోయి వాచీ, అవసరమొచ్చి డబ్బూ తీసుకున్నాడు గాని, యింకేమన్నా అలాగ తీసుకుపోయిఉంటే మరచిపోకుండా పంపెయ్యమని రాయి." అన్నాడు శాస్త్రి...అనేసి "శ్రీరస్తు భవదంఘ్రి చికురంబులకు..." అంటూ పద్యం లంకించుకున్నాడు. మళ్ళా మా జీవితం ప్రారంభించామని చెప్పడానికి నాందీ వాచకంలా వినిపించిందా పద్యం.

★

1953 సింహావలోకనం

(49-వ పేజీ తరువాయి)

తారలుగా ఉచ్ఛదశ అందుకోవడం జరిగింది. వీరు నటించిన రెండు చిత్రాలు "దేవదాసు" "బ్రతుకుతెరువు" శతదినోత్సవాలు చేసుకున్నాయి.

ఈ విషయాలు తప్పిస్తే, మొత్తంమీద 1953 వ సంవత్సరం ఆశాజనకమైనది కాదనే అనిపిస్తున్నది. 1953 లో నేర్చుకున్న పాఠాలు 1954 లో ఉపయోగపడితే పరిశ్రమ యిప్పటి మాంద్యస్థితినుంచి తప్పక తేరుకోగలదు. స్టూడియోల అద్దెలు సగానికి సగం తగ్గడం ఒక మంచి శుభసూచన. ఇదివరకు ఒక కాల్ షీట్ కు అయ్యే ఖర్చుతో ఇప్పుడు రెండు కాల్ షీట్లు వస్తున్నాయి. తారల రేట్లుకూడా బాగా పడిపోయాయి. అభివృద్ధికిరాగల కొత్తతారలు పలువురు రంగంలో ప్రవేశించారు. రచయితలు, దర్శకులు యువకతరంవారనేకులు వచ్చారు. వృథాగా కాలమూ, ధనమూ ఖర్చుచేయకుండా చురుకుగా చిత్రాలు నిర్మించాలనే ధోరణి యెక్కువైంది. చిత్రాలసంఖ్య పరిమితం చేయడం ఎలాగూ అసంభవం కాబట్టి, తక్కువ వ్యయంలో తీయడం ఆదర్శంగా పెట్టుకుని నిర్మాతలు ముందుకువస్తే, ఈ సంవత్సర ఫలితాలు నిరుటికంటె ఉత్సాహకరంగా ఉండగలవు.

అంజలీ పిక్చర్స్ వారు తమ రెండవ చిత్రంగా ప్రసిద్ధ ప్రేమకథ "అనార్కలీ" నిర్మిస్తారు. కథ, మాటలు, పాటలు సముద్రాలవారు వ్రాస్తారు. అంజలీదేవి అనార్కలీగా, నాగేశ్వరరావు సలీమ్ గా, ఎస్. వి. రంగారావు అక్బర్ గా నటిస్తారట. సంగీతం ఆదినారాయణ రావుగారు సమకూరుస్తారు. దర్శకత్వం వేదాంతం రాఘవయ్య. డిస్ట్రిబ్యూటర్లు పూర్ణావారు.